క్లుప్తంగా

వైభవంగా ఇటికాలమ్మ తీర్థం


మాచవరంలో వేంచేసియున్న ఇటికాలమ్మవారు

అంబాజీపేట: మాచవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ ఇటికాలమ్మ అమ్మవారి తీర్థం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామ ఆడపడుచులతో పాటు భక్తులు అమ్మవారిని దర్శించుకొని చలివిడి, పానకం, ముడుపులు, మొక్కుబడులను తీర్చుకొన్నారు. ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నారిన శ్రీనివాసరావు, అరిగెల నాగబాబుల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. గురువారం రాత్రి నిర్వహించిన జాతరలో గరగ నృత్యం, వీరనాట్యం, శక్తివేషాల ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి.

11న మండల సమావేశం

మామిడికుదురు: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఈ నెల 11వ తేదీన జరుగుతుందని ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు మండల పరిషత్ అధ్యక్షురాలు కుసుమ వనజకుమారి అధ్యక్షతన జరిగే సమావేశంలో రాజోలు, పి.గన్నవరం ఎమ్మెల్యేలు రాపాక వరప్రసాదరావు, కొండేటి చిట్టిబాబు ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. మండల పరిధిలోని 18 గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని తెలిపారు.

మహాత్ముని స్ఫూర్తితో జగన్ పాలన


పలివెలలో నేతల విగ్రహాల వద్ద నివాళులర్పించిన వెంకటేశ్వర్లు

కొత్తపేట: మహాత్మా గాంధీ ఆశయ స్ఫూర్తితో రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా గాంధీ మహాత్ముడు 1929 మే 5న మండల పరిధిలోని పలివెల గ్రామాన్ని సందర్శించారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం మహాత్మాగాంధీ అధ్యయన సంస్థ వ్యవస్థాపకుడు దుళ్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ గంగాధరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గ్రామ ప్రధాన వీధిలో మహాత్మునితో పాటు జాతి నాయకుల విగ్రహాలకు, ధర్మసత్రం వద్ద స్వాతంత్ర్య సమర యోధుడు, మాజీ ఎమ్మెల్సీ తురగా పురుషోత్తం విగ్రహానికి ఎంపీపీ తదితరులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆనాడు ఇక్కడే సంపూర్ణ స్వాతంత్ర్యం తీర్మానం చేశారన్నారు. రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

దేవస్థానం భూమిలో తవ్వకాలు నిలుపుదల


అక్రమ మట్టి తవ్వకం పనులను నిలుపుదల చేస్తున్న సత్యనారాయణ

సఖినేటిపల్లి: మండల పరిధిలోని కేశవదాసుపాలెంలో అంతర్వేది దేవస్థానంకు చెందిన భూమిలో శుక్రవారం అనధికార మట్టి తవ్వకం పనులను అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ నిలుపుదల చేశారు. దేవస్థానం భూమిలో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయంటూ వచ్చిన సమాచారం మేరకు సిబ్బందితో కలసి ఆయన ఆ ప్రాంతానికి వెళ్లారు. ఎండోమెంట్స్ నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మానవత్వం చాటుకున్న వెల్ఫేర్ అసిస్టెంట్ నరేష్


తిరుపతి ఆసుపత్రిలో రోజాకు పింఛన్ పంపిణీ చేస్తున్న నరేష్

సఖినేటిపల్లి: అంతర్వేదిపాలెంకు చెందిన సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ కటికిరెడ్డి నరేష్ సుదూర ప్రాంతంలో పింఛన్ పంపిణీ చేసి మానవత్వం చాటుకున్నారు. అంతర్వేదిపాలెంకు చెందిన చెవ్వాకుల షారోన్ రోజా కిడ్నీలకు సంబంధించిన సమస్యలతో తిరుపతిలోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ క్రమంలో ఆమెకు తొలిసారిగా పింఛన్ రూ.10,000 మంజూరైంది. దీంతో కచ్చితంగా ఆమె మంజూరైన పింఛన్ తీసుకోవాల్సి ఉంది. ఈ మేరకు గురువారం నర్సాపురం నుంచి 528 కిలోమీటర్ల దూరంలో ఉన్న తిరుపతికి ట్రైన్‌లో నరేష్ వెళ్లారు. శుక్రవారం సదరు ఆసుపత్రిలో షారోన్ రోజాకు నరేష్ పింఛన్ అందజేశారు.

పేదల పాలిట వరం 'ఫ్యామిలీ డాక్టర్'

- ఇంటి ముంగిటకు ఉచిత వైద్య పరీక్షలు, సేవలు
- ప్రజల హర్షాతిరేకాలు


కొత్తపేటలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లో వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ ఇందిరాభారతి

కొత్తపేట: 'ఫ్యామిలీ డాక్టర్' పథకం పేద, మధ్య తరగతి ప్రజల పాలిట వరంగా మారింది. రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల ఆర్థికాభివృద్ధికి సంక్షేమ పథకాలతో పాటు 'విద్య, వైద్యం ప్రధానం' అని గుర్తించింది. ఆ మేరకు 'నాడు-నేడు' పథకం ద్వారా ఆయా రంగాలను బలోపేతం చేసింది. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్, కార్పొరేట్ తరహాల్లో అభివృద్ధి చేసింది. విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించింది. ఇక వైద్య రంగం విషయానికొస్తే ప్రజల చెంతకే వైద్య సేవలను తీసుకెళ్లింది. దానిలో భాగంగా గత ఏడాది అక్టోబర్ 22 నుంచి ట్రయల్‌రన్ చేపట్టిన 'వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్-ఫ్యామిలీ ఫిజీషియన్' పథకాన్ని గత నెల 6 నుంచి పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నారు. ఈ పథకంపై ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఏ రోగమొచ్చినా పట్టణాలకే పరుగులు..

గతంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఏ చిన్న రోగమొచ్చినా, ఏ పెద్ద జబ్బు చేసినా ప్రాణాలు అరచేత పెట్టుకుని పట్టణాలకు పరుగు పెట్టేవారు. దీర్ఘకాలిక రోగులు, ఆరోగ్యశ్రీలో శస్త్రచికిత్సలు చేయించుకున్నవారు, గర్భిణులు, బాలింతలు కూడా పరీక్షలు నిమిత్తం పట్టణాలకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడేవారు. పేద ప్రజలు వైద్యం చేయించుకోలేక, మందులు కొనలేక ప్రాణాల మీదకు తెచ్చుకున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ప్రభుత్వమే ఫ్యామిలీ డాక్టర్ పథకం ద్వారా వైద్యులను, సిబ్బందిని గ్రామాలకు పంపించి వైద్య పరీక్షలు చేయిస్తోంది. మందులు ఇస్తుంది. మొదట మండలానికి ఒక 104 వైద్య సేవల వాహనం ఉండగా 'వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్-ఫ్యామిలీ ఫిజీషియన్' పథకంతో మరో వాహనాన్ని ప్రభుత్వం సమకూర్చింది. ప్రత్యేక వైద్య సిబ్బందిని నియమించింది. ఆ బృందం ప్రతి సచివాలయం పరిధికి నెలకు 2 సార్లు వెళ్లి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తుంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వైద్య సేవలు అందిస్తారు. ముఖ్యంగా 104లో ఈసీజీ, గర్భిణులకు ఫీటల్ హార్ట్ రేట్ మానిటర్, హెచ్‌బీ వంటి టెస్టులు, 14 రకాల టెస్టులు, 90 రకాల మందులు ఇస్తున్నారు. స్థానికంగా సాధ్యం కాని వైద్య సేవలకు రాజమహేంద్రవరం, కాకినాడ జీహెచ్ వంటి పెద్దాసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు. అవసరమైన మందులు ఉచితంగా అందిస్తున్నారు. దీంతో గ్రామాల్లో వైద్య బృందాలు వచ్చేటప్పటికి విశేష స్పందన కనిపిస్తోంది. ఈ విధానంతో గ్రామాల్లో రోగులు ప్రభుత్వ డాక్టర్లు అందించే సేవలకు అలవాటు పడ్డారు.

అందుబాటులో వైద్య సేవలు



గతంలో ఏ చిన్న వ్యాధికి గురయినా కొత్తపేట లేదా, రాజమహేంద్రవరం వంటి దూర ప్రాంతాల్లో ఆస్పత్రులకు ఎన్నో వ్యయ ప్రయాసలతో వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు సీఎం జగన్ ప్రభుత్వం పుణ్యమా అని ఆ బాధ లేకుండా వైద్యులతో సహా సిబ్బంది మా ఇంటి దగ్గరకే వచ్చి వైద్య సేవలందిస్తున్నారు. మందులిస్తున్నారు. గతంలో మా ఆయనకి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో హార్ట్ ఆపరేషన్ చేయించాం. ఆరోగ్యంగా ఉన్నారు. గ్రామానికి, ఇంటికి వైద్యులు వస్తున్న ఈ పథకం చాలా మంచిది.

– బిళ్లకుర్తి దుర్గ, బిళ్లకుర్రు, కొత్తపేట మండలం

ప్రభుత్వ లక్ష్యం మేరకు..



ప్రభుత్వ లక్ష్యం మేరకు గ్రామాల్లో మెరుగైన వైద్య సేవలందిస్తున్నాం. షెడ్యూల్ ప్రకారం గ్రామ సచివాలయాల పరిధిలో సిబ్బందితో వెళ్లి ఓపీ నిర్వహిస్తున్నాం. వివిధ పరీక్షలతో పాటు అన్ని రకాల రోగులకు వైద్య సేవలందిస్తున్నాం. ప్రభుత్వం అన్ని రకాల మందులు సరఫరా చేయగా పేషెంట్లకు అవసరమైన మందులు అందజేస్తున్నాం. ఆరోగ్యశ్రీ శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఆరోగ్యం గురించి ఫాలోఅప్ చేస్తున్నాం. ప్రజలు కూడా అందుబాటులోకి వచ్చిన సేవలకు అలవాటుపడ్డారు.

– డాక్టర్ కేఎస్ఎస్‌బీ హర్ష, పీహెచ్‌సీ, వానపల్లి

గోశాలకు దాణా వితరణ


దాణా అందజేస్తున్న సేవా బృందం సభ్యులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని దేవస్థానంలోని గోశాలకు శుక్రవారం స్వామివారి సేవా బృందం సభ్యులు 120 కేజీల దాణా వితరణ చేశారు. నల్లా సత్యకృష్ణ కిరణ్ ప్రసాద్, తూము నాగవెంకన్నబాబు, సలాది సత్యనారాయణ కలిసి అందజేశారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ సమక్షంలో గోశాల సిబ్బందికి వారు దాణాను అందజేశారు.

కేశనపల్లిలో అగ్ని ప్రమాదం


ప్రమాదంలో కాలిపోతున్న తాటాకు ఇల్లు

మలికిపురం: మండల పరిధిలోని కేశనపల్లిలో శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో గంధం శివాజీకి చెందిన తాటాకు ఇల్లు దగ్ధమైంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లనే ప్రమాదం సంభవించిందని బాధితుడు తెలిపారు. ఇంట్లో ఉన్న ఫర్నిచర్‌తో పాటు బీరువాలో దాచి ఉంచిన నగదు రూ.1.50 లక్షలు కాలిబూడిదైనట్టు ఆయన అన్నారు.

జగన్ సర్కారుకు అండగా నిలవాలి

- ఎమ్మెల్యే చిట్టిబాబు
- పెదపట్నంలో గడప గడపకూ మన ప్రభుత్వం


పెదపట్నంలో గడప గడపకూ మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: అహర్నిశలు ప్రజల సంక్షేమం కోసం పరితపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు బాసటగా నిలవాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు కోరారు. పెదపట్నంలో శుక్రవారం ×గడప గడపకూ మన ప్రభుత్వం× కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి వారికి యోగక్షేమాలు తెలుసుకున్నారు. వారికి ప్రభుత్వం ద్వారా అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. పథకాలకు సంబంధించి కరపత్రాలు అందించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలోనే సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ పథకాలు నిరంతరంగా కొనసాగాలంటే ప్రజలు జగన్ సర్కారుకు అండగా నిలవాలన్నారు. ×మీ ఆశీస్సుల కోసం వచ్చాం. మీ చల్లని దీవెనలు అందించి, మమ్మల్ని ఆశీర్వదించండి× అని చిట్టిబాబు కోరారు. స్థానిక సర్పంచ్ గుబ్బల దుర్గాభవాని, గ్రామ శాఖ అధ్యక్షుడు కొమ్ముల చిన్న, పార్టీ జేసీఎస్ మండల కన్వీనర్ జక్కంపూడి వాసు, వైఎస్సార్ సీపీ నేతలు కొండేటి స్టాలిన్ బాబు, కుసుమ శ్రీధర్, తులా గోపాలకృష్ణ, యనమదల సత్యనారాయణ, గోగి రామ్మూర్తి, కొమ్ముల శ్రీనివాస్, కాండ్రేగుల బాబి, పంచాయతీ కార్యదర్శి తాడి ఏసుబాబు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్ బాధితునికి సాయం

కొత్తపేట: విద్యుత్ షాక్‌తో తీవ్రంగా గాయపడి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రునికి మండల యువ శెట్టిబలిజ సంఘం రూ.45 వేలు సాయం అందించింది. స్థానిక పెదరాముడు నూతిమెరక గ్రామానికి చెందిన దొంగ రామకృష్ణ విద్యుత్ షాక్‌తో తీవ్రంగా గాయపడి రావులపాలెంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సంఘ సభ్యులు రూ.35 వేలు, హైదరాబాద్ కుత్బుల్లాపూర్ శెట్టిబలిజ యువజన సంఘం రూ.10 వేలు మొత్తం రూ.45 వేలు శుక్రవారం అందజేశారు. సంఘ అధ్యక్షుడు బొక్కా ప్రసాద్, గౌరవాధ్యక్షుడు యనమదల శ్రీనివాసరావు, కార్యదర్శి శీలం కొండబాబు, ఖండ్రిగ ఉప సర్పంచ్ కడలి పార్థసారథి, కోశాధికారి మామిడిశెట్టి బాలాజీ, జాయింట్ సెక్రటరీ కడలి భీమా పాల్గొన్నారు.

వేసవి శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

అంబాజీపేట: వేసవిలో ఇచ్చే శిక్షణలను ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకుని వాటిపై అవగాహన పెంచుకోవాలని సర్పంచ్ జల్లి బాలరాజు, ఎంపీటీసీ సభ్యుడు పబ్బినీడి రాంబాబు అన్నారు. పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూల్‌లో సర్పంచ్ బాలరాజు ఆధ్వర్యంలో బైర్రాజు ఫౌండేషన్ సౌజన్యంతో వేసవి ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ నెల 2 నుంచి 5వ తేదీ వరకు 1 నుంచి డిగ్రీ విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ శిక్షణ ఇచ్చామన్నారు. వేదిక మేక్స్, పెయింటింగ్ తదితర వాటిపై శిక్షణ పొందిన వారికి ధ్రువీకరణ పత్రాలు అందించారు. రిటైర్డ్ ఉద్యోగి బెహరా హనుమంతరావు ఆధ్వర్యంలో ప్రతిభావంతులకు అవార్డులను అందించారు. ఉప సర్పంచ్ వీర రవి, ఆకెళ్ల సూరిబాబు, దొమ్మేటి సురేష్ పాల్గొన్నారు.

చక్రపెరుమాళ్ల స్వామికి స్నానం


అంతర్వేది బీచ్‌లో చక్రపెరుమాళ్ళ స్వామికి సముద్రస్నానం చేయిస్తున్న నాగేంద్రకుమార్

సఖినేటిపల్లి: అంతర్వేదికరలో కొలువై ఉన్న భూసమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అంతర్వేది బీచ్‌లో చక్రపెరుమాళ్ల స్వామికి భక్తులు సముద్ర స్నానం చేయించారు. ఆలయ నిర్మాత స్వర్గీయ డాక్టర్ పోతురాజు సూర్య వెంకట సత్యనారాయణ కుమారులు, నిర్వాహకులు వెంకట కృష్ణ, నాగేంద్ర కుమార్, లక్ష్మీనారాయణ ఈ కార్యక్రమం నిర్వహించారు. తొలుత వైఖానస ఆగమం ప్రకారం ఆలయ పూజారులు స్వామి సన్నిధిలో విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తుల గోవిందనామ స్మరణల మధ్య, వేదమంత్రాలతో బీచ్‌కు తరలి వెళ్లి స్వామికి సముద్ర స్నానం నిర్వహించారు.

వెంకన్నకు చక్రస్నానం

అంబాజీపేట: కొర్లపాటివారిపాలెంలో వేంచేసియున్న శ్రీ భూసమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం చక్రస్నానం నిర్వహించారు. ఆలయ అర్చకులు పాణింగపల్లి నరసింహాచార్యులు ఆధ్వర్యంలో చక్రస్నానం జరిపారు. అంతకుముందు స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. గంగలకుర్రు అగ్రహారంలో వేంచేసియున్న శ్రీ ఉమా పార్వతి సమేత వీరేశ్వరస్వామి, శ్రీ భూసమేత కేశవస్వామి వార్లకు త్రిశూల చక్రస్నానాలు వైభవంగా జరిగాయి. స్వామివార్ల కల్యాణోత్సవాల్లో భాగంగా త్రిశూల, చక్రస్నానాలు నిర్వహించామని ఆలయ అర్చకులు చంద్రమౌళి కామేశ్వర శర్మ, సుదర్శనం కేశవాచార్యులు తెలిపారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.


చక్రస్నానంలో పాల్గొన్న భక్తులు

సేవలందించేవారికి గుర్తింపు


వైద్య సిబ్బందిని సత్కరిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు వరలక్ష్మి

అంబాజీపేట: కష్టకాలంలో ప్రజలకు సేవలందించిన వారికి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా గుర్తింపు ఉంటుందని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి, హెచ్ఎం మోకా ప్రకాష్ అన్నారు. తొండవరంలో బుద్ధపౌర్ణిమ జయంతి వేడుకలను అంబేడ్కర్ యువజన సంఘం, ముత్తాబత్తుల విజయశేఖర్, నాగాబత్తుల శ్రీనుల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరోనా కష్టకాలంలోను, వరదల సమయంలోను ప్రజలకు విశిష్టమైన సేవలందించిన హెల్త్ సూపర్ వైజర్ జేవీఎస్ ప్రసాద్, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలకు, ఎంఎల్‌హెచ్‌పీలను సత్కరించారు. పితాని వీరాస్వామి, వెన్నపు రాంబాబు, వాకపల్లి శ్రీనివాసరావు, చప్పిడి రాజు, ఎస్.మురళీ, జి.గోపాలకృష్ణ, బయ్యా మోహనరావు, భూపతి మనోహర్‌రాజు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి

అంబాజీపేట: కుమారుడితో జరిగిన కుటుంబ తగాదాల నేపథ్యంలో వృద్ధుడైన తండ్రి అనుమానాస్పద స్థితిలో శుక్రవారం ఉదయం మృతి చెందాడు. అంబాజీపేట పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మొసలపల్లి శివారు జగ్గన్నతోట శ్రీరామచంద్రానగర్ కాలనీలో నూకపెయ్యి కృష్ణమూర్తి (85) అతని కుమారుడు నూకపెయ్యి ఏడుకొండలతో కలిసి నివసిస్తున్నాడు. కృష్ణమూర్తి, అతని కుమారుడు ఏడుకొండల మధ్య గురువారం ఘర్షణ చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో కృష్ణమూర్తి ఇంటి ఆవరణలో ఉన్న కొబ్బరి చెట్టుకు ఉరి వేసుకుని ఉండటంతో అతని భార్య, రెండవ కుమారుడు నాగరాజు పోలీసులకు సమాచారం తెలిపారు. మృతుడు రెండవ కుమారుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ కె.హరిచంద్రప్రసాద్ తెలిపారు.

ఘనంగా మాచేనమ్మ జాతర

పి.గన్నవరం: గ్రామ శివారు తాటికాయలవారిపాలెంలో వేంచేసిన మాచేనమ్మ వారి జాతర మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు 8వ తేదీ వరకూ జరుగుతాయని తాటికాయలవారిపాలెం వినాయక యువజన సంఘ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం అమ్మవారిని నిలబెట్టారు. శనివారం రాత్రి అమ్మవారి జాతరను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ఆదివారం అమ్మవారికి గ్రామస్తులు నైవేద్యాలు సమర్పిస్తారన్నారు. సోమవారం భక్తులకు అన్న సమారాధన చేస్తామన్నారు.

లారీ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ కార్యవర్గం

రావులపాలెం: స్థానిక కనకదుర్గా లారీ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం శుక్రవారం జరిగింది. స్థానిక అమలాపురం రోడ్డులోని కనకదుర్గా ఆలయం వద్ద జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు కానూరి పోసిబాబు, గౌరవ అధ్యక్షుడు నందం సత్యనారాయణ, ఉపాధ్యక్షులు చేకూరి వెంకటరామరాజు, కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, సెక్రటరీగా కాకుమళ్ళ సత్తిబాబు, జాయింట్ సెక్రటరీగా చప్పిడి ప్రసాద్, ట్రెజరర్‌గా పెద్దమళ్ళ కృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు.

ఘనంగా డ్రై డే

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం నెలకొల్పేందుకు ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రై డే)గా పాటించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎం.సుమలత, పి.భవానీ శంకర్ కోరారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీనివల్ల క్రిమికీటకాలు దరి చేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని కోరారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది భారీ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీరాజా, సూపర్‌వైజర్లు పీవీరమణారావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అర్హతకు తగిన ఉద్యోగ కల్పన ప్రభుత్వ లక్ష్యం


కొత్తపేటలో శిక్షణ పూర్తిచేసిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ పెద్దిరాజు, డీఎస్‌డీఓ లోకమాన్ తదితరులు

కొత్తపేట: విద్యార్హతకు తగిన ఏదో ఒక ఉద్యోగం కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక డిగ్రీ కళాశాల స్కిల్ హబ్ సెంటర్‌లో మూడు నెలల శిక్షణ ముగింపు కార్యక్రమం శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దిరాజు అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ స్కిల్ హబ్స్ ఏర్పాటు చేసిందన్నారు. శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులు ఈ స్కిల్ హబ్ ఇచ్చే సర్టిఫికెట్ ఆధారంగా ప్రభుత్వం నిర్వహించే జాబ్ మేళాల ద్వారా లేదా స్వయంగా వివిధ కంపెనీలకు దరఖాస్తు చేసుకోవడం ద్వారా ఉద్యోగాలు పొందాలన్నారు. వెబ్ డెవలపర్ కోర్సు సర్టిఫికెట్ ద్వారా సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు పొంది జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఏపీ ఎస్ఎస్‌డీసీ డీఎస్‌డీఓ పి.లోకమాన్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.అరుణ్‌కుమార్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ప్రసన్న, అధ్యాపకులు జి.శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

జగన్మోహినీ కేశవస్వామి ఆలయానికి రూ.20 వేల విరాళం


దాతకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ కృష్ణ చైతన్య

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయ అభివృద్ధికి అదే గ్రామానికి చెందిన పేర్చేర్ల సత్యనారాయణరాజు (లింగరాజు), బానుమతి దంపతులు రూ.10 వేలు, అన్నదానానికి రూ.10 వేలు విరాళం అందించినట్లు ఈఓ బి.కృష్ణ చైతన్య తెలిపారు. దాతకు ఆయన చేతుల మీదుగా స్వామివారి చిత్రపటం అందజేశారు.

ర్యాలిలో ఘనంగా చక్రస్నానం

మండల పరిధిలోని ర్యాలి శ్రీజగన్మోహినీ కేశవస్వామి ఆలయంలో వేంచేసియున్న శ్రీరమా సత్యనారాయణ స్వామి, ర్యాలి ఉమాకమండలేశ్వర స్వామి ఆలయాల్లో శుక్రవారం స్వామివార్ల చక్ర స్నానం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామి వార్లకు విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, నీరాజన మంత్రపుష్పం, గ్రామోత్సవం, తదితర పూజా కార్యక్రమాలను అర్చక స్వాములు వైభవంగా జరిపించారు. అలాగే సాయంత్రం ఉమాకమండలేశ్వరస్వామి శ్రీపుష్పోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ బి. కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

రైతులను ఆదుకుంటాం


మోదుకూరులో తడిసిన ధాన్యం రాశులను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ ముక్కంటి

ఆలమూరు: అకాల వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని కొత్తపేట ఆర్‌డీఓ ఎం.ముక్కంటి అన్నారు. తుపాను ప్రభావంతో వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాల వల్ల తడిసిపోయిన ధాన్యాన్ని పరిశీలించి మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం ఆయన పరిశీలించారు. వర్షాలు తగ్గిన వెంటనే పంట నష్టం అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామన్నారు. రైతులెవ్వరూ ఆందోళన చెందవద్దని, తడిసిన ప్రతి గింజను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. తడిసిన ధాన్యం పరిరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను ఏఓ ఎస్.లక్ష్మీ లావణ్య వివరించారు. తహసీల్దార్ ఐపీ శెట్టి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ఆత్రేయపురం: ప్రభుత్వ నిబంధనలతో రైతుల వద్ద నుంచి తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని ఆర్‌డీఓ ఎం. ముక్కంటి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండల పరిధిలోని కట్టుంగ గ్రామంలో ధాన్యం పట్టుబడిని పరిశీలించారు. అకాల వర్షాలు కురవడంతో వరి పంటకు నష్టం జరిగిందన్నారు. రైతుల పరిస్థితిపై ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు రైతులను ఇబ్బందులు పెట్ట వద్దన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు దుగ్గిరాల వెంకట నాగ అనిల్‌కుమార్, ఆర్ఐ భవానీ వీఆర్‌ఓ జ్యోతి పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ప్రారంభం

సఖినేటిపల్లి: మండల పరిధిలోని శృంగవరప్పాడులో శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాలను శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ప్రారంభించారు. బాల సుందరం ఎడ్యుకేషనల్ సొసైటీ కరస్పాండెంట్ డి.రాజబాబు సారథ్యంలో ఈ కళాశాలను తెచ్చినట్టు ప్రిన్సిపాల్ రావి శ్రీనివాస్ తెలిపారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

అయినవిల్లి: మండలంలోని 21 గ్రామాల్లో ఉపాధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య తెలిపారు. అయినవిల్లి, పోతుకుర్రు గ్రామాల్లో ఉపాధి పనులను ఎంపీడీఓ పరిశీలించారు. 21 గ్రామాల్లో 32 పనులను 1,300 మంది కూలీలు చేస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట ఏపీఓ పి.నాగబాబు ఉన్నారు.

గోదావరి మాతకు పున్నమి హారతి

ఆలమూరు: మండలంలోని జొన్నాడలోనున్న అఖండ గౌతమీ గోదావరి తీరంలో బుధవారం సాయంకాలం గోదావరి మాతకు అఖండ పున్నమి హారతి ఇచ్చారు. వేద పండితులు ద్విభాష్యం రవికృష్ణ శర్మ ఆధ్వర్యంలో మహాశ భక్త బంద సభ్యులు శాస్త్రోక్తంగా ఈ పున్నమి హారతిని చేపట్టారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య మహిళలు స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత జనార్ధన స్వామి ఆలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరి గౌతమీ తీరానికి చేరుకుని గోదావరి మాతకు అఖండ పున్నమి హారతిని ఇచ్చి పూజలు నిర్వహించారు.